ఎక్కడి చెత్త అక్కడే..!


డెయిలీ కూరగాయల మార్కెట్ వద్ద చెత్తతో నిండిపోయిన మురికి కాలువ


మెంగారం గైనిలో రోడ్డుపై పారుతున్న మురికి నీరు

- ఇష్టారాజ్యంగా డ్రెయినేజీల నిర్వహణ
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పత్తాలేని ప్రత్యేకాధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలన్నీ దుర్వాజన వెదజల్లుతున్నాయి. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికినీళ్లన్నీ రోడ్లపైకి వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్నెళ్ల క్రితం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. జీపీల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేకాధికారులను నియమించగా ఆర్నెళ్లుగా వారు కనిపించకుండా పోయారు.

జీపీ కార్యదర్శులను ఫోన్ల ద్వారా సంప్రదిస్తూ నామ్‌కే వాస్తేగా పనిచేస్తున్నారు. దాంతో లింగంపేట మండల కేంద్రంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రెండు నెలలుగా గ్రామాల్లో వారు పర్యటించడం లేదు. దుర్వాసన కారణంగా పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్, ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో, సాయిబాబా ఆలయం వెనుక భాగంలో, బీసీ హాస్టల్ ఎదుట, సంత జరిగే ప్రాంతంలో రెండో వార్డులో చీరపెండ్ల కుంటకు వెళ్లే నీటికాల్వ, కల్లు దుకాణాల పరిసరాలు మురికితో నీటితో నిండిపోయాయి. అలాగే పోస్టాఫీస్ నుంచి పెద్దమ్మ గుడి వరకు పానాది రోడ్డుకు మురికి కాల్వలు నిర్మించకపోవడంతో ప్రతీ రోజు రోడ్డుపైకి మురికి నీరు వచ్చి చేరుతుంది. దాంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో మురికి కాల్వలు పూడికతీత చేసి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సింగితం రిజర్వాయర్ వద్ద కంటైనర్ ఏర్పాటు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన కంటైనర్‌ను శనివారం నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ ప్రారంభించారు. నీటి పారుదలశాఖ భద్రతా సిబ్బంది రక్షణ కోసం నీటి పారుదల శాఖ అధికారులు కంటైనర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా రిజర్వాయర్ వద్ద భద్రత సిబ్బంది వర్షాకాలంలో పడుతున్న కష్టాలను 'సాక్షి'లో పలుమార్లు ప్రచురించగా ఉన్నతాధికారులు స్పందించి కంటైనర్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదలశాఖ సిబ్బంది భూమయ్య, బీమయ్య, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

30న అర్చకుల సమావేశం

మద్నూర్(జుక్కల్) : బాన్సువాడ డివిజన్‌లోని పనిచేస్తున్న దూపదీప నైవేద్యం అర్చకులకు మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఈనెల 30వ తేదీన సమావేశం ఉన్నట్లు ఆలయ కమిటీ సిబ్బంది తెలిపారు. బాన్సువాడ డివిజన్‌లో పని చేస్తున్న అర్చకులు తప్పకుండా ఈ సమావేశానికి హాజరుకావాలని వారు సూచించారు. అలాగే సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ వ్యవసాయ భూముల బహిరంగ కౌలు వేలం, దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమం ఉందని ఆలయ సిబ్బంది కులకర్ణి వేణు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



బిచ్కుంద(జుక్కల్) : గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య కార్మికుల చేత విధులు, మురికి కాలువలు శుభ్రం చేయించి పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఎంపీవో మహబూబ్ అన్నారు. శనివారం మాన్యాపూర్ జీపీని సందర్శించి రికార్డులు పరిశీలించారు.తాగునీటి పైపులైన్ లీకేజీ లేకుండా చూడాలని ప్రతిరోజు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి, రోడ్లపై మురికినీరు నిలువ ఉండకుండా గుంతలను పూడ్చాలన్నారు. పల్లె ప్రకృతి వనం, వన నర్సరీలను పరిశీలించారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



రామారెడ్డి : అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అటవీశాఖ సెక్షన్ అధికారి భీంరెడ్డి అన్నారు. రామారెడ్డి మండలంలోని గోకుల్ తండాలో శనివారం అడవులను సంరక్షణపై తండా వాసులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో గిద్ద ఎంపీటీసీ ప్రవీణ్‌గౌడ్, అటవీశాఖ అధికారులు శేఖరెడ్డి, శ్రీధర్, సుధీర్, పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు



రాజంపేట : మండలం పరిధిలోని అన్ని గ్రామాలకు వానాకాలం పచ్చిరొట్ట పంటల ఎరువులు రైతులకు జీలుగ విత్తనం 250 క్వింటాళ్ల రాజంపేట, ఆర్గోండ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో అందుబాటులో ఉన్నాయని సజావుగా పంపిణీ చేస్తామని ఏడీఏ అపర్ణ అన్నారు.

కామారెడ్డి మండలంలో..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండల రైతులకు 60 శాతం సబ్సిడీపై జీలుగ, పెద్ద జనుము విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా 833 జీలుగ, 282 పెద్ద జనుము విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు.

మండల సమాఖ్యలో ఆడిట్



రాజంపేట : మండల సమాఖ్యలో శనివారం అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన 22 గ్రామ సంఘాలకు సంబంధించి 2023–24 ఆడిట్ నిర్వహించారు. 22 సంఘాలకు సంబంధించి ఆడిట్ పూర్తయ్యిందని సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ కృష్ణారెడ్డి,ఏపీఎం సాయిలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి


దేశాయిపేట్‌లో మాట్లాడుతున్న తులసి

బాన్సువాడ రూరల్ : మహిళలు, చిన్నారుల కోసం ఉన్న ప్రత్యేక చట్టాలు, హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి జిల్లా మహిళా సాధికారిత కేంద్రం అధికారిణి తులసీ అన్నారు. శనివారం ఆమె బాన్సువాడ మండలం దేశాయిపేట్‌లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి మహిళా కూలీలకు చైతన్యం కల్గించారు. కేంద్ర ప్రభుత్వం బేటి బచావో బేటి పడావో, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలతో ప్రోత్సహిస్తోందన్నారు. మహిళా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరి, బుక్ బైండింగ్ ప్రింటింగ్, బేకరి, బ్యూటీషియన్, ఆఫీస్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారని, ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాన్సువాడ మండల అభివృద్ధి అధికారి బషీరుద్దీన్, జీపీ కార్యదర్శి రవి, ఫీల్డ్ అసిస్టెంట్ పోచీరాం పాల్గొన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచిన అధికారులు


తలమడ్లలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న సిబ్బంది


రుద్రారంలో..

రాజంపేట : రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామంలో గత 20 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందిన విషయం విదితమే. ఐదు రోజులుగా ఆందోళన చెందారు. స్థానిక నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఉన్నతాధికారులు సమాచారం ఇవ్వగా వెంటనే అధికారులు ధాన్యాన్ని కాంటా చేశారు. మండల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సావుసాని సంపత్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే స్పందించి వెంటనే అధికారులను ఆదేశించారన్నారు.

నేడు కేంద్రాలను మూసివేయాలి..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నేటి సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సొసైటీ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని రుద్రారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేవలం రుద్రారంలో ధాన్యం ఎక్కువగా ఉండడంతో జాప్యం జరిగిందన్నారు. ఆదివారం సాయంత్రానికి ధాన్యం కొనుగోలు చేసి సెంటర్‌ను ఎత్తే యాలన్నారు. తహసీల్దార్ మహేందర్‌కుమార్, గిర్దావార్ శ్రీనివాస్, కార్యదర్శి పెంటయ్య ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపాల్

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని రాజుల్లా, బిచ్కుందలో శనివారం ఎంపీడీవో గోపాల్ ఉపాధి హామి పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రతి రోజు రూ.300 కూలీ చెల్లిస్తామని ఎంపీడీవో కూలీలకు వివరించారు. పని చేస్తామని ముందుకు వచ్చిన ప్రతీ కూలీకి పనులు కల్పిస్తున్నామన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి, తుర్కపల్లి గ్రామాల్లో ఉపాధి పనుల వద్ద వానాకాలం పంటల సాగుపై శనివారం క్లస్టర ఏఈవో మదుసూధన్ రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని చెప్పడంతో సన్నరకాల పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. స్థానిక రైతులు అంజయ్య తదితరులు ఉన్నారు.

బాన్సువాడ రూరల్‌లో..

బాన్సువాడ రూరల్ : మండలంలోని కొల్లూర్, సోమేశ్వర్, తాడ్కోల్ గ్రామాల్లో కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను శనివారం కామారెడ్డి జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వామన్‌రావు పరిశీలించారు. కూలీ గిట్టుబాటు కావడం లేదని తెల్పడంతో నిర్ధేశిత కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఉపాధిహామీ పనుల ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు మస్టర్లలో హాజరు నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సృజన్‌రెడ్డి, టీఏ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


తుంకిపల్లిలో మాట్లాడుతున్న ఏఈవో మధుసూదన్


కొల్లూర్‌లో మాట్లాడుతున్న ఏపీడీ వామన్‌రావు

ఎమ్మెల్యేకు సన్మానం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును అమెరికాలోని తెలంగాణ ప్రతినిధులు సన్మానించారు. అమెరికా దేశంలోని వాషింగ్టన్ రాష్ట్రం సియాటెల్ నగరంలో అమెరికా తెలంగాణ తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి



ఎల్లారెడ్డి : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలిపి నీరు కలుషితం కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పట్టణంలోని కాలనీలను శుభ్రంగా ఊడ్వాలని, మురికి కాలువలను శుభ్రపర్చాలని అన్నారు.కార్యక్రమంలో సిబ్బంది తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బీబీపేట : మండల కేంద్రానికి చెందిన గజెల్లి బాలమణి ఇటీవల మృతి చెందడంతో వారికి శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి సంఘం తరుపున రూ. 25 వేల ఆర్థికసా యం అందించారు. ఇంటి అవసరాల నిమిత్తం నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన చాకలి బాలమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఆదే గ్రామానికి చెందిన సిరిగాద శంకర య్య రూ. 10 వేల ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. రంజిత్ కుమార్, పిన్నోజి, ప్రసాద్ పాల్గొన్నారు.

పెరిగిన బీడీ కార్మికుల వేతనాలు

కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్/భిక్కనూరు/లింగంపేట : బీడీ కంపెనీల యాజమాన్యాలు, బీడీ కార్మిక సంఘాల నాయకుల మధ్య వేతన ఒప్పంద సఫలమైందని తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం, బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సిద్దిరాములు తెలంగాణ బీడీ కార్మిక సంఘం జిల్లా కో- కన్వీనర్ సింగం శ్రీనివాస్, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి పెద్ది శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన భత్యాలు ఈనెల నుంచే అమల్లోకి వస్తాయన్నారు.

పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మి


బోర్లంలో పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలోని అమ్మ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను ఎంపీడీవో పరిశీలించారు. పనులను వేగవంతం చేసి పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులున్నారు.

స్కూళ్లలో పనులు త్వరగా పూర్తవ్వాలి

బాన్సువాడ రూరల్ : తెలంగాణ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు నూతన హంగులు సమకూరుస్తోందని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని బోర్లం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పనులు పరిశీలించారు. పాఠశాలల తిరిగి ప్రారంభం నాటికల్లా పాఠశాలలకు రంగులు వేయడం సహా అన్ని పనులు పూర్తిచేయించాలన్నారు. మండల విద్యాధికారి నాగేశ్వరరావు, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, జీపీ కార్యదర్శి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామంలో ఎండిన మొక్కలు


పూర్తిగా ఎండిపోయిన మొక్కలు

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండలంలోని వీరాపూర్ వైకుంఠ ధామంలో ఏర్పాటు నాటిన మొక్కలు ఎండి పోతున్నాయి. రూ. 3 లక్షలు ఖర్చు చేసి బురియల్ గ్రౌండ్ పేరుతో నాటిన మొక్కలు ఉపయోగంలోకి తేవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. లక్షలు ఖర్చు చేసి నాటిన మొక్కలను గాలికి వదిలేసి నిధులన్నీ నీళ్ల పాలు చేశారు. ప్రక్కనే మొక్కలను నాటడం కోసం నర్సరీ ఏర్పాటు చేస్తున్నారు. కాని గతంలో నాటిన మొక్కలను మాత్రం సంరక్షించడంలో అధికారులు విఫలమయ్యారని తెలుస్తోంది.

ఆధ్యాత్మికం

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో ఉన్న శ్రీ వెంకటేశ్వరాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో భజన చేసుకుంటూ వెంకటేశ్వరా స్వామి విగ్రహాన్ని తాంబూలంలో ఉంచి ఆలయం ఆవరణలో ఛావ తీశారు. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు సిద్ధిరాంరెడ్డి, గంగారాం, బాలకిషన్ రావు, సిద్దిరాములు, హన్మాండ్లు, వెంకట్‌రెడ్డి, రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ దేవతలకు బోనాలు



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ఉన్న అన్ని దేవతలకు బోనాలు, ప్రత్యేక పూజలు నిర్వహి స్తామని చెప్పారు. మండలంలోని మాగి గ్రామ శివారులో సోమవారం మల్లయోదులకు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

దుర్గమ్మకు బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయిలాపూర్‌లో శనివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో దుర్గమ్మకు బోనాలు ఊరేగించారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిఇంటికి బోనం తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో డప్పువాయిద్యాలు, పోతరాజు విన్యాసాలతో బోనాలు ఊరేగించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని బేగంపూర్ తండాలో శనివారం జై భవాని మాత శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాల మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి బోనాలతో ఊరేగించారు. మహ భోగ్ బండార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తండావాసులు, భక్తులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని లింగాపూర్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 6వ వార్షికోత్సవాల తొలిరోజు కార్యక్రమాలు శనివారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆది, సోమవారాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

అంజన్న ఆలయంలో భక్తుల సందడి



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులతో సందడిగా మారింది. చూట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహరాజ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అన్నదానం చేశారు.

మట్టి శివలింగాల తయారీ పుణ్యకార్యం



భిక్కనూరు : కాశీలో ప్రతిష్ఠించే కోటి మట్టి శివలింగా తయారీలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావించాలని సిద్దరామేశ్వరాలయ మహంత్ సదాశివ మహంత్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరులోని నగరేశ్వరాలయంలో మట్టితో తయారు చేస్తున్న శివలింగాల తయారీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిష్ఠతో ఈ శివలింగాల తయారిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మట్టి శివలింగాల తయారీ భిక్కనూరు విభాగం ఇన్‌చార్జి చీకోటి ప్రభాకర్ పాల్గొన్నారు.

సిద్దరామేశ్వరాలయంలో రుద్రహోమం



భిక్కనూరు : మండలంలోని సిద్దరామేశ్వరాలయంలో హైకోర్టు న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి-కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఉడిపి వేద పండితులు నిర్వహిస్తున్న వేదపారాయణం, వాస్తు హోమ పూజలు ఐదోరోజు ఘనంగా కొనసాగాయి. శనివారం ఆలయం ప్రాంగణంలో రుద్రహోమం, ఐక్యమత హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ టీపి లింబాద్రి, భక్త కమిటీ ప్రతినిదులు మైపాల్ రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్తం

27న స.హ. చట్టంపై తరగతులు

కామారెడ్డి అర్బన్ : సమాచార హక్కు చట్టంపై ఈనెల 27న సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి స్థానిక డెయిరీ టెక్నాలజీ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

కామారెడ్డి అర్బన్ : జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని, నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కొయ్యగుట్టలో పశువైద్య శిబిరం

బాన్సువాడ రూరల్ : మండలంలోని కొయ్యగుట్ట తండాలో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో భాగంగా పశుసంవర్ధకశాఖ ఏడీఏ డాక్టర్ రోహిత్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి జైపాల్ సింగ్ ఆధ్వర్యంలో మేకలు, గొర్లకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది జర్పుల సంధ్య, ఖాదర్, విఠల్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లను యజమానులు శుభ్రం చేసుకోవాలి



కామారెడ్డి టౌన్ : పట్టణంలో తన సొంత ప్లాట్లను యజమానులు శుభ్రం చేసుకోవాలని లేకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సానిటరీ ఎస్సై రవీందర్ హెచ్చరించారు. ప్లాట్లు శుభ్రంగా లేకపోవడం, పిచ్చి మొక్కల కారణంలో దోమలు, క్రిమీకీటకాలు, విష ప్రాణులతో ఇబ్బందులు పడుతున్నామని 46వ వార్డులో స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు ఆయన గురువారం పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ కన్నయ్య తదితరులున్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బాన్సువాడ డివిజన్ ఆర్డీవో రమేశ్ రాథోడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ శీతల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం ముగింపు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలో హనుమాన్ ఆలయంలో వారం రోజుల నుంచి అఖండ హరినామ సప్తాహం నిర్వహించారు. ప్రతిరోజు అకండ హారతి, భజన కీర్తనల కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం చివరి రోజు కాల కీర్తనలో భాగంగా మహిళలు కలశాల ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించారు. అన్నదానం చేశారు.